క్లుప్తంగా

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి



పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ ఆనంద్ సూచించారు. గురువారం మండలంలోని మాధరావుపల్లి, శాగాపూర్, కదిరెపాడు, దావాత్‌ఖాన్‌పల్లి, ఆకునోనిపల్లితండా ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, సీఆర్పీ గోవింద్‌నాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పోరాటయోధుల ఆశయాలు సాధించాలి



మదనాపురం: మండలకేంద్రంలో గురువారం బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గొనికాడి రాములయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహనీయుల ఆశయ సాధన లక్ష్యంగా కాన్షీరాం పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుర్మయ్య, అంజియాదవ్, విజయ్‌కుమార్, శివశంకర్‌యాదవ్, డి. లక్ష్మయ్య, రవికుమార్, వెంకటస్వామి, అంజి పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతి బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో ఆయన చిత్రపటానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ కులసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గొనికాడి రాములుయాదవ్ మాట్లాడుతూ.. దళిత, బహుజన, పేదప్రజల హక్కులకోసం జీవితాంతం పోరాడారన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్‌జీ, జేఎం.మీశేక్, బీమపల్లి నాయుడు, ఇజ్రాయిల్, కొత్త గంగాధర్, విజయ్‌కుమార్, శివశంకర్‌యాదవ్, హోటల్ కురుమూర్తి, జీ.మహేష్, వికాస్, నసీర్, సతీష్, లక్ష్మయ్య బాబాయ్, షకీల్, సంద రామచంద్రి, జగన్న ముదిరాజ్, అమ్మపల్లి నరసింహ ప్రసాద్, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

'బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్'

అమరచింత: బీసీ రిజర్వేషన్ల పేరిట ప్రభుత్వం బీసీలను మోసం చేస్తూ నాటకాలను ఆడుతున్నదని బీజేపీ మండల అధ్యక్షురాలు మంగలావణ్య అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామంటూ శాస్త్రీయపరంగా వాటిని అమలు పర్చలేక రిజర్వేషన్ బిల్లును ఆమోదించుకోలేని స్థితిలో ఉంటూ ఎన్నికల నోటిఫికేషన్ వేయడం, హైకోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టి స్టే విధించడం జరిగిందన్నారు.సమావేశంలో భరత్‌సింహారెడ్డి, వినోద్, మల్లారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని శానాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మిద్దె మురళి(40) గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి గురువారం మధ్యాహ్నం శానాయిపల్లి గ్రామానికి చేరుకుని మాట్లాడారు. ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగా పలువురు పరామర్శించారు.

రేషన్ బియ్యం పట్టివేత

వనపర్తి రూరల్: జిల్లాకేంద్రంలో రాయిగడ్డ కాలనీకి చెందిన ఓ ఇంట్లో అక్రమంగా ఉంచిన 4క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. వనపర్తి పట్టణంలోని రాయిగడ్డ కాలనీకి చెందిన బొల్లెద్దుల ఆనంద్ ఇంట్లో రేషన్‌బియ్యం ఉన్నాయని పక్కా సమాచారంతో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ దుబ్బాక పరమేష్, పోలీసులతో కలిసి అతని ఇంట్లో తనిఖీ నిర్వహించారు. అక్రమంగా ఉంచిన 4క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకొని తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ఆనంద్‌పై కేసునమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పంటల బీమా ఊసేది..?



చిన్నంబావిలో వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న

- వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- నష్ట పరిహారానికి నోచుకోని రైతులు
- మొక్కజొన్న, మినుము, పత్తిపైన ప్రభావం

చిన్నంబావి: ఉచిత పంటలబీమా పథకం అమలులో లేక అన్నదాతలు తీవ్రనష్టపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో తుడిచిపెట్టుకు పోతున్నా ఆదుకునేవారు కరువయ్యారు. మండలంలో ఏటా వర్షాలు వడగళ్ల వానలతో రూ.వేలాది రైతులు నష్టపోతున్నారు. గతంలో పంటలబీమా పథకం అమలులో ఉన్నప్పుడు ఆలస్యంగా అయినా నష్టపరిహారం లభించేది. నాలుగేళ్లుగా పంటలబీమా పథకం అమలుకావడం లేదు. దీంతో ప్రకృతి వైపరీత్యాలవల్ల రైతులు నిలువునా మునిగిపోతున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఉచితపంటల బీమా పథకాన్ని పునరుద్ధరించడంలో ప్రభుత్వం మీనామేషాలు లెక్కిస్తోంది. గతేడాది వానాకాలం సీజన్ నుంచి బీమాను పునరుద్ధరించినట్లు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం గతేడాది, ఈ ఏడాది కూడా పంటల బీమాను అమలు చేయడం లేదు.

ఈ ఏడాదైనా అమలయ్యేనా..?

మండలంలో గూడెం, పెద్దమారు, వెల్టూరు, అయ్యవారిపల్లి, కాలురు, చెల్లపాడు, కొప్పునూరు, పెద్దదగడ గ్రామాల్లో అత్యధిక ఎకరాల్లో ఇటీవల కురిసిన అధిక వర్షాలకు మొక్కజొన్న, మినుము, పత్తి పంటలు నష్టాలబాటలో ఉంది. రెండు పంటలను సాగు చేసే రైతులు సైతం ఒక్క పంటను మొక్కజొన్న పంటను సాగు చేశారు. కానీ ఓ వైపు అతివృష్టి, అనావృష్టి వంటి ఒకేసారి రావడంతో రైతులు అంతకుకంతుకు పెరిగిపోయాయి. పెట్టిన పెట్టుబడి రాక పంటలను చీడపీడల నుంచి రక్షించుకోలేక రైతులు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు కనీసం పంట నష్టప రిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి



ఇటీవల కురిసిన వర్షాలకు నా కున్న మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నాశనం అయింది. రెండు పంటలను సాగు చేయాలనుకున్న కానీ వాతావరణం అనుకూలించడం లేదు. గతేడాది సైతం ఇదే పరిస్థితి కొనసాగింది.

–మహేష్, గూడెం గ్రామం



చిన్నంబావిలో వర్షాలకు దెబ్బతిన్న మినుము పంట

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

వీపనగండ్ల: నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎస్ఐ కె.రాణి అన్నారు. గురువారం బొల్లారం ఉన్నత పాఠశాలలో వితరణగా అందజేసిన సీసీ కెమెరాలు, సౌండ్‌సిస్టమ్ ఆమె ప్రారంభించారు. కొర్లకుంట గ్రామానికి చెందిన నర్సింహాచారి రూ.45వేల విలువగల సీసీ కెమెరాలు, రూ.25వేలతో పాఠశాలకు సౌండ్‌సిస్టమ్‌ను వితరణగా అందజేయడం ఎంతో అభినందించదగ్గ అంశమని ఆమె అన్నారు. గ్రామీణప్రాంతాల్లో దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సీసీ కెమెరాల ఏర్పాటుకు తమవంతు తోడ్పాటునందిచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాల ఆవరణలో అనుమానస్పద వ్యక్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వితరణ దాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రఘు, ఉపాధ్యాయులు పరుశరాం, శ్రీనివాసులు, రాధ, భగవంతు, గ్రామస్తులు మండ్లకృష్ణయ్య, సాయిబాబు, శివ, రుద్రప్ప, రాము పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ఏర్పాటు గదిని ప్రారంభిస్తున్న ఎస్ఐ కె.రాణి

చెరుకు పంటకు మద్దతు ధర ప్రకటించాలి

అమరచింత: టన్ను చెరుకుకు కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు మద్దతు ధర ప్రకటించాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం మండల చెరుకు రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పత్తికి మద్దతుధర క్వింటాకు రూ. 8150 ఇస్తున్నదని, పత్తికి ఇస్తున్న మద్దతుధర ప్రకారం చెరుకు పంటకు సైతం ఇవ్వాలన్నారు. కృష్ణవేణి షుగర్ యాజమాన్యం రైతులనుంచి చెరుకును ఫ్యాక్టరీకి తరలించిన 14 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. ఈనెల 11న ఆత్మకూర్‌లోని మార్కెట్ యార్డులో ఆత్మకూర్ జోన్ చెరుకు రైతుల సమావేశం నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి అమరచింత, ఆత్మకూర్ మండలాల రైతులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఉమ్మడిజిల్లా కార్యదర్శి జి.రవి, యువరాజు, డేవిడ్, విజయ్, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి

పాన్‌గల్: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యులు సూచనలను పాటించాలని పీహెచ్‌సీ వైద్యుడు డా.చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సురక్షిత్ మాతృవ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి అవసర సూచనలు, మందులను పంపిణీ చేశారు. అనంతరం కేతేపల్లి గ్రామానికి చెందిన గర్భిణి మౌనిక సుఖప్రసవంలో ఆడపిల్లకు జన్మనిచ్చిందని తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు మైథిలి, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ జయమ్మ, శాంతి, ఆశ కార్యకర్త కవిత పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు

అమరచింత: కేంద్రప్రభుత్వం చిరువ్యాపారులకు బ్యాంకు ద్వారా వ్యాపారం చేసుకునేందుకు ఆత్మనిర్భర్ పథకం నుంచి రుణాలను అందిస్తున్నదని చిరువ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజ్, మెప్మా కో ఆర్డినేటర్ యువరాజ్ కోరారు. మున్సిపల్ సమావేశ హాలులో గురువారం నిర్వహించిన లోకకల్యాణ మేళాలో చిరువ్యాపారులతో పాటు పట్టణ మహిళ సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ ద్వారా కొత్తగా చిరువ్యాపారుల కోసం మొదటివిడతగా రూ.15వేల రుణాన్ని అందిస్తున్నదన్నారు. రెండోపర్యాయం రూ.25వేలు, మూడో పర్యాయం రూ.50 వేలను బ్యాంకుద్వారా అందిస్తుందని వీటికి గతంలో మాదిరిగా జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గతంలో చిరువ్యాపారులకు రుణం ఇచ్చే సమయంలో జీఎస్టీకి సంబంధించిన డబ్బులను ముందే వసూలు చేసుకునే వారన్నారు. వీటితోపాటు ఐదుగురు చిరువ్యాపారులు గ్రూప్‌గా ఏర్పడితే అలాంటి వారికి వ్యాపారం నిమిత్తం రూ.3 లక్షలు రుణంగా ఇస్తుందన్నారు. గ్రూప్‌ల తయారీలో ఆర్పీలు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలతో పాటు మహిళసమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

నేత్రదానం చేసిన కుటుంబీకులు



శాంతయ్య (ఫైల్)

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన గంధం శాంతయ్య అనారోగ్యంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తాను మరణించిన అనంతరం ఇతరులకు చూపు ఇవ్వాలనే ఆలోచనతోనే కళ్లను దానం చేయమని శాంతయ్య కుటుంబీలకు తెలిపారు. దీంతో హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టూట్‌కు అందజేసినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. శాంతయ్యను స్ఫూర్తిగా తీసుకొని అవయవాలను దానం చేసి ఇతరులకు ప్రాణదాతలు కావాలని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. గ్రామస్తులు శాంతయ్య కుటుంబ సభ్యులను అభినందించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఖిల్లాఘనపురం: ఫౌండేషన్ సభ్యులు అందజేస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. గురువారం మండలంలోని సోళీపురంలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాస్తున్న 8వతరగతి విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్, క్లాస్‌మేట్‌క్లబ్, అవోపా సహకారంతో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమానికి హాజరై ఆయన పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు పొంది స్కాలర్‌షిప్‌లు సాధించాలన్నారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్‌క్లబ్ జిల్లా కోశాధికారి రాఘవేందర్, ఉపాధ్యాయులు అజీమ్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. కాగా బోడగట్టుతండా, అల్లమాయపల్లి ప్రాథమిక పాఠశాలలు పరిశీలించారు.



సోళీపురంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ

'బీసీలపై చిత్తశుద్ధి లేని పార్టీ కాంగ్రెస్'

ఖిల్లాఘనపురం: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించి అభివృద్ధిలో దేశంలోనే రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొదటిస్థానంలో నిలపడం జరిగిందని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ళకృష్ణయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ నుంచి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అమలుసాధ్యం కాని ఆరుగ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసిగింది కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. నేడు బీసీలకు 42శాతం రిజర్వేషన్ అంటూ మరోమారు ఘోరంగా మోసగించిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మొఖం చాటేసి కొత్తగా బీసీలకు 42 శాతం అంటూ కొత్త రాగం ఎత్తుకోవడం జరిగిందన్నారు. అమలుగాని హామీలు ఇవ్వడం కోర్టులు మొట్టికాయలు వేస్తే తాము చేస్తుంటిమి కోర్టు వద్దన్నది అంటూ దాటవేస్తున్నారన్నారు. ఇలా ప్రజలను మోసగించాలని చూస్తే తగిన బుద్ధి చెబుతారని చెప్పారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)పై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తిరుమల్‌రావు మాట్లాడుతూ.. సమాచార హక్కుచట్టం 2005 (ఆర్టీఐ) అనేది భారతపౌరులకు ప్రభుత్వ సమాచారాన్ని పొందే హక్కును కల్పించే ఒక చట్టమన్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడం, అవినీతిని అరికట్టడం, పౌరులకు సాధికారత కల్పించడం వంటి లక్ష్యాలతో రూపొందించారన్నారు. సమావేశంలో అధ్యాపక బృందం వెంకటరెడ్డి, బాలనాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు పోరాడాలి



అమరచింతలో చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అమరచింత: గెరిల్లా పోరాటయోధుడు చేగువేరా ఆశయాలను కొనసాగించేందుకు నేటితరం యువకులు ముందుకు రావాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ కోరారు. చేగువేరా వర్ధంతిని పురష్కరించుకుని గురువారం మండలంలోని కొంకన్వానిపల్లేలో చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో యువత నిర్వీర్యం అవుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి చూపడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అంజి, శ్రీను, వెంకటేష్, మైబు, రాజు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: ప్రపంచ విప్లవయోధుడు చేగువేరా కలగన్న ధనిక, పేద భేదం లేని సమసమాజ స్థాపనకు పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో చేగువేరా వర్ధంతిని పలువురు పార్టీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమేష్, గోపాలకృష్ణ, చిన్న కురుమయ్య, పృథ్వీనాథం, జ్యోతి, రూప, సుప్రియ, అంజి కురుమయ్య పాల్గొన్నారు.

వైభవంగా పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్మకూర్: మండలంలోని మూలమల్ల గ్రామంలో పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభోవపేతంగా కొనసాగుతున్నాయి. గురువారం వేలాదిమంది భక్తుల సమక్షంలో స్వామి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అలాగే స్వామివారి ఊరేగింపులో భజనమండలి ఆధ్వర్యంలో కీర్తనలు ఆలపించారు, ప్రత్యేక పూజలు, మహామంగళ హారతి, ప్రసాద వితరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సుదూరప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కార్యక్రమంలో అర్చకులు గిరిధర్ జోషి, శ్రీధర్‌జోషి, నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు:

పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు వేర్వేరుగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యేను శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మూలమల్లలో పాండురంగస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నామినేషన్ కేంద్రం పరిశీలన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని గురువారం ఆర్డీఓ సుబ్రమణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రిటర్నింగ్ అధికారి ఎస్.వరప్రసాదరావు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.రణధీర్‌ను నామినేషన్ సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బీసీలపై ఏ పార్టీకి చిత్తశుద్ధి లేదు

వనపర్తి విద్యావిభాగం: బీసీలపై జరుగుతున్న కుట్రయే ఈ ఎన్నికల డ్రామాఅని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. మొదటినుంచి బీసీ రిజర్వేషన్ తంతు సరిగా జరగలేదని, బీసీలపై ఏ పార్టీకి చిత్తశుద్ధి లేదన్నారు. అగ్రవర్ణాల నాయకులనీ, వారు ఎలా చేయగలరని ప్రశ్నించారు. రిజర్వేషన్ల బిల్లుపెట్టేది వాళ్లే, ఆదరబాదరగా ఎలక్షన్ పెట్టేది వారే, కోర్టుకు వెళ్ళేది వారే, కోర్టుల్లో వాదించేది వారేనని జడ్జిమెంట్ ఇచ్చేది వారేనని కనుక బీసీలపై వారికెలా ప్రేమ ఉంటుందన్నారు. బీసీ నాయకుల చేతికి ఈ రిజర్వేషన్ తంతు అప్పగించి ఉండి ఉంటే సరైన దిశగా మాకు రిజర్వేషన్లు కల్పించడం జరుగుతుండేదని అగ్రహం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో చట్టసభల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుంటే ఉద్యమాలు చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, గొనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, రామస్వామి, నాగరాజు, రమేష్, జింగిడిపురం రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌యాదవ్

పెబ్బేరులో రెండు నామినేషన్లు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని గురువారం తోమాలపల్లి ఎంపీటీసీ స్థానానికి 2 నామినేషన్లు , రంగాపూర్, గుమ్మడం నామినేషన్ కేంద్రాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానానికి నామినేషన్లు వేయలేదని ఎంపీడీఓ రోజారెడ్డి తెలిపారు.

వనపర్తి మండలంలో చందాపూర్, చిట్యాల, పెద్దగూడెం గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానానికి ఎవరుకూడా నామినేషన్ వేయలేదని ఎంపీడీఓ రవీంద్రబాబు తెలిపారు. శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్, గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానానికి ఎవరు కూడా నామినేషన్ వేయలేదని ఎంపీడీఓ రవినారాయణ తెలిపారు.

ఎంపీటీసీకి ఒక్క నామినేషన్ దాఖలు

గోపాల్‌పేట: మండలంలో పాలికెపాడు ఎంపీటీసీకి గురువారం మధ్యాహ్నం స్వతంత్ర్య అభ్యర్థిగా ఒక నామినేషన్ దాఖలైందని ఎంపీడీఓ భవాని తెలిపారు. ఆముదాలకుంటకు చెందిన ముడావత్ సీల్యానాయక్ నామినేషన్ దాఖలు చేశారు.

దంచి కొట్టిన వాన

- ఉధృతంగా పారిన ఊకచెట్టు వాగు
- నీటమునిగిన మదనాపురం వంతెన
- రాకపోకలకు అంతరాయం

మదనాపురం: మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జనజీవనం తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఎడతెరిపి లేని వర్షాలధాటికి సరళసాగర్, శంకరసముద్రం జలాశయాల్లోకి వరద నీరు భారీగా చేరింది. ఊకచెట్టువాగు పొంగి ప్రవహించడంతో మదనాపురం వద్ద ఉన్న లోతట్టు వంతెన పూర్తిగా మునిగిపోయింది. ఈ పరిస్థితి నేపథ్యంలో రాత్రి 8గంటల నుంచే వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మదనాపురం, చిన్నచింతకుంట, ఆత్మకూరు, అమరచింత, కొత్తకోట, వనపర్తి, జిల్లా కేంద్రానికి రవాణా సంబంధాలు పూర్తిగా తాత్కాలికంగా తెగిపోయాయి. ప్రవాహం తీవ్రంగా ఉండటంతో అధికారులు వాగు పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రస్తుతం కూడా వాగులో నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో, సాధారణ రవాణా పునరుద్ధరణకు మరికొన్ని గంటలు పట్టే అవకాశముంది. ప్రజలు అవసరమైతే మాత్రమే ప్రయాణాలు చేయాలని, అధికారుల సూచనలు పాటించాలని సూచిస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తకోట రూరల్: అయ్యప్ప ఆలయ నిర్మాణానికి పటణానికి చెందిన కీ.శే.ఎద్దుల గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సత్యమ్మ, కుమారుడు రవికుమార్‌రెడ్డి రూ.1,01,016లు నిర్వాహకులకు అందజేశారు. అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు ధూపం నాగరాజు, వేముల సుధాకర్‌రెడ్డి, భీమకిషోర్, అనిల్ కుమార్, బలిజ లింగేశ్వర్, సత్యంసాగర్, విశ్వనాథం గంగాధర్‌శెట్టి, ఆకుల శ్రీనివాసులు, మద్దిగట్ల బాలకృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్‌సాగర్, రాజవర్ధన్‌రెడ్డి, ఉన్నారు.

మూడు బైక్‌లు ఢీ..

- నలుగురికి తీవ్రగాయాలు

వనపర్తి రూరల్: మూడు బైకులు ఢీ కొని నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండలంలోని అంజనగిరి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం చెందిన బి.సురేష్ బైక్‌పై వస్తూ, పాన్‌గల్ మండలం మాందాపురం గ్రామానికి చెందిన సంగమోని సాయికుమార్, వంశీ ఇద్దరు కలిసి బైక్‌పై వస్తూ, అదే మండలం బుసిరెడ్డిపల్లికి చెందిన బుసిరెడ్డి రాఘవేందర్ ద్విచక్ర వాహనంపై వస్తూ వీరి మూడుబైకులు అంజనగిరి సమీపంలో ఢీకొన్నాయి. ప్రమాదంలో నలుగురు వ్యక్తులు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యం



భాగ్యలక్ష్మి

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలో యువతి కనిపించడం లేదని గురువారం తల్లి చాకలి యాదమ్మ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. పట్టణంలో గాంధీ చౌక్ చెందిన చాకలి భాగ్యలక్ష్మి(18) తెల్లవారు జామున ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటినుంచి వెళ్లింది. మళ్లీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకి లభించలేదు. తల్లి చాకలియాదమ్మ వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి మిస్సింగ్..



దినేష్‌కుమార్

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలో విద్యార్థి కనిపించడం లేదని గురువారం తల్లి జంగోల వినీల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హరిప్రసాద్ కథనం మేరకు జిల్లాకేంద్రంలో తిరుమలకాలనీకి చెందిన జంగోల దినేష్‌కుమార్(17) ఈనెల 6 ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మళ్లీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వారి ఇళ్లలో వెతికినా అతని ఆచూకి దొరకలేదు. తల్లి జంగోళ్ల వినీల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.